క్లుప్తంగా

వ్యక్తిపై కేసు నమోదు

ఖానాపూర్: మండలంలోని రాంరెడ్డిపల్లె గ్రామానికి చెందిన శివరాత్రి లక్ష్మన్ అనే వ్యక్తిపై గురువారం న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రి తెలిపారు. అతిగా మద్యం సేవించి డయల్ 100కు ఫోన్ చేయడంతో పాటు పోలీసుల సమయాన్ని వృథా చేస్తున్నాడని ఎస్సై అన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఆయనకు రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

నిర్వాహకులు జాగ్రత్తలు పాటించేలా చూడాలి

ఖానాపూర్: గణేశుడి ప్రతిమలను ఏర్పాటు చేసే మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించేలా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండపాలకు విద్యుత్ సరఫరా తదితర విషయాల్లో జాగ్రత్తలపై నిర్వాహకులకు అవగాహన కల్పించాలని కోరారు.

వృద్ధురాలు అదృశ్యం.. కేసు నమోదు


రాధ (ఫైల్)

కడెం: మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామానికి చెందిన దస్తురాబాద్ రాధ అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. రాధ ఈనెల 5న సాయంత్రం పొలం వద్ద కట్టేసిన ఎడ్లను తీసుకొచ్చేందుకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. రాధ కూతురు బోర్లకుంట కృష్ణకుమారి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. సదరు వృద్ధురాలు కనిపిస్తే 87126 59525 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

సరుకులు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్‌లో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన శ్రావణి, నాగమణి అనే ఇద్దరు పిల్లలకు శుక్రవారం మా అమ్మనాన్న ఫౌండేషన్ చైర్మన్ రూ.5వేల విలువైన బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ సెంగెం నర్సన్న తదితరులు ఉన్నారు.

దొంగలున్నారు.. జాగ్రత్తగా ఉండండి

నిర్మల్‌టౌన్: పట్టణంలో దొంగలున్నారని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి పండుగ నేపథ్యంలో పూజాసామగ్రి కోసం మార్కెట్ వెళ్లినప్పుడు దొంగలు మిమ్మల్ని గమనిస్తూ ఉంటారన్నారు. మీ జేబులో ఉన్న సెల్‌ఫోన్లు, పర్సులు దొంగలిస్తారని.. అనుమానితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

వైద్యశిబిరం

మామడ: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే విద్యాలయంలో శుక్రవారం వైద్యశిబిరం, డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు వరుణ్, శ్రీకాంత్ విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాజు ఉన్నారు.

చెట్టు తొలగింపు


చెట్ల కొమ్మలు తొలగిస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి పొట్టపెల్లి నుంచి లక్ష్మణచాంద వెళ్లే మార్గంలో రోడ్డుపై చెట్టు, కొమ్మలు విరిగి పడటంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. నిర్మల్ నుంచి లక్ష్మణచాంద వెళ్తున్న మండల కాంగ్రెస్ నాయకుడు ఈటెల శ్రీనివాస్ తన మిత్రుడితో రోడ్డుపై పడిన చెట్ల కొమ్మలను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. నాయకులు సయ్యద్ సిరాజుద్దీన్, కొట్టూరి సృజన్ తదితరులు ఉన్నారు.

అగ్నిమాపకశాఖ నిబంధనలు పాటించాలి

భైంసాటౌన్: పెట్రోల్‌పంపుల్లో అగ్నిమాపకశాఖ నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని అగ్నిమాపకశాఖ భైంసా అధికారి రాజారాం అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంఎస్ పెట్రోల్‌పంపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్బన్ డై ఆక్సైడ్ సిలిండర్లు పనిచేయకపోవడంపై నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంటలార్పే కార్బన్ డై ఆక్సైడ్ సిలిండర్లు, బకెట్లలో ఇసుక ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పెట్రోల్‌పంపు సిబ్బందికి ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

పర్యావరణహితం.. మట్టి ప్రతిమలు

- పాఠశాలల్లో తయారు చేసి అందించిన విద్యార్థులు


ప్రతిమ చేస్తున్న కస్తూ పాఠశాల విద్యార్థులు


నిర్మల్‌లో ప్రతిమలు విక్రయిస్తున్న మహిళ


నిర్మల్‌లోని కస్తూ పాఠశాలలో మట్టితో ప్రతిమలను తయారు చేస్తున్న చిన్నారులు


మామడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మట్టి ప్రతిమను తయారు చేస్తున్న విద్యార్థులు


లోకేశ్వరం జూనియర్ కళాశాలలో ప్రతిమలు తయారు చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

మామడ: మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు శుక్రవారం మట్టితో వినాయక ప్రతిమలను తయారు చేశారు. మామడ, కొరిటికల్, చెరువు ముందరితండా, దిమ్మదుర్తి పాఠశాలల్లో ఉపాధ్యాయుల సూచనలతో పర్యావరణ పరిరక్షణకు మట్టితో విగ్రహాలను తయారు చేసి పంపిణీ చేశారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు మట్టితో వినాయక ప్రతిమలను తయారు చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గౌతమ్, అధ్యాపకులు శ్రీధర్, శ్రీనివాస్, వినోద్, చిన్నయ్య, మహేందర్, విఠల్ తదితరులున్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరు కేజీబీవీలో విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసి పలువురికి అందజేశారు. ఎంఈవో ముత్యం, ఎస్‌వో సువర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన మట్టి ప్రతిమకు ప్రధానోపాధ్యాయుడు రాజునాయక్ తొలి పూజ చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం


మట్టి ప్రతిమలు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్, ఉత్సవ సమితి సభ్యులు

భైంసాటౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలనే పూజిద్దామని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం సాయంత్రం హిందూ ఉత్సవసమితి ఆధ్వర్యంలో భైంసాలోని బస్టాండ్ ఎదుట అంబేద్కర్ విగ్రహం వద్ద మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. దీనికి ఎమ్మెల్యే హాజరై ప్రతిమలు అందించి మాట్లాడారు. మట్టితో చేసిన విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేస్తే పర్యావరణా నికి హాని కలుగదని పేర్కొన్నారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు కాశీనాథ్, కపిల్, సభ్యులు బబ్లు మహా రాజ్, విలాస్ గాదేవార్, నగేశ్, తూమోల్ల దత్తాత్రి, మల్లేశ్, గోపాల్ కిషన్, రాము, రాజేశ్వర్, పాపయ్య, నవీన్, కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన


చేతిపంపు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

నర్సాపూర్(జి): తమకు సరిపడా భగీరథ జలం రాక ఇబ్బంది పడుతున్నామని మండల కేంద్రంలోని 13వ వార్డులో మహిళలు చేతిపంపు వద్ద శుక్రవారం ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేశారు. కాలనీలో ఉన్న చేతిపంపు చెడిపోయి మూడు నెలలవుతున్నా పంచాయతీ అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదని వాపోయారు. మరమ్మతులు చేపట్టాలని పంచాయతీ అధికారులను పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో వేరే చోటకు వెళ్లి నీటిని తెచ్చుకొని అవసరాలు తీర్చుకుంటున్నట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. ఈ విషయమై నర్సాపూర్ (జి) ప్రత్యేకాధికారి తిరుపతిరెడ్డిని 'సాక్షి'వివరణ కోరగా చేతి పంపునకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.

మహాలక్ష్మి ఆలయంలో పూజలు

కుంటాల: శ్రావణమాసం పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. గురుస్వామి కదార్ల హరిప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి తదితర పూజాది కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

సమయపాలన పాటించాలి

- డీఎంహెచ్‌వో రాజేందర్
- న్యూవెల్మల్ బొప్పారం పీహెచ్‌సీ తనిఖీ


వివరాలు తెలుసుకుంటున్న వైద్యాధికారి రాజేందర్

సోన్: వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. జ్వరపీడితులు ఉన్న గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆరోగ్య కార్యక్రమాలను అమలు చేసి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని పేర్కొన్నారు. డిప్యూటీ జిల్లా విస్తరణ మీడియా అధికారి బారే రవీందర్, వైద్యులు శ్యామ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్


నిర్మల్‌లో శోభాయాత్ర రూట్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌టౌన్: గణేశుడి శోభాయాత్ర కొనసాగే మార్గంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గణపతి నిమజ్జన శోభాయాత్ర నిర్వహించే రూట్‌ను మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ సీవీఎన్ రాజుతో కలిసి పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చవితి పండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలన్నారు. శోభాయాత్ర కొనసాగే మార్గంలో లైటింగ్స్, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వినాయకసాగర్ వద్ద గజ ఈతగాళ్లు, సేఫ్టీ బ్యాగ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ సంతోష్, కౌన్సిలర్లు నవీన్, నరేందర్, అన్వర్ పాషా, మున్సిపల్ అధికారులు ,సిబ్బంది తదితరులు ఉన్నారు.

భైంసాటౌన్: నవరాత్రోత్సవాలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆర్డీవో కోమల్ రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టర్ అభిలాష అభినవ్ పట్టణంలో నిమజ్జన శోభాయాత్ర రూట్ పరిశీలించి రోడ్లపై గుంతలు పూడ్చివేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో మున్సిపల్ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టగా శుక్రవారం ఆర్డీవో పనులు పరిశీలించారు. గణేశ్‌నగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు మరమ్మతులను సిబ్బందితో కలిసి పరిశీలించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


సభ్యురాలు ఏర్పాటు చేసిన నాటుకోళ్ల ఫామ్ పరిశీలిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

సోన్: బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో స్వయం సహాయక సంఘంలో సభ్యురాలైన తయ్యాబ్ ఏర్పాటు చేసిన ఆలుచిప్స్ తయారీ యంత్రాన్ని ప్రారంభించారు. అనంతరం షరీనా బేగం ఏర్పాటు చేసుకున్న నాటుకోళ్లఫామ్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా స్వచ్ఛదనం–పచ్చదనంలో భాగంగా ర్యాలీ తీసి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. టీజీబీ మేనేజర్ రేఖ, డీపీఎం విజయలక్ష్మి, ఏపీఎం గంగామణి, అర్జుబాయ్, సీసీలు శ్రీనివాస్, వెంకటరమణ, కార్యదర్శి వెంకటరమణారెడ్డి, టీఏ కృష్ణ, వీఏఓలు, మహిళా సంఘాల సభ్యులు, పాల్గొన్నారు.

మేఘం కరిగెను.. చినుకై చిందెను




జిల్లా కేంద్రంలో శుక్రవారం ఉదయం నుంచి జనం ఉక్కపోతతో విలవిల్లాడిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. నిర్మల్ నలువైపులా మబ్బులు కమ్ముకొని భారీ వర్షం కురిసింది. సుమారు 40 నిమిషాల పాటు కురిసిన భారీ వర్షానికి రోడ్లపైకి వరద చేరింది.
- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి


తానూరులో మాట్లాడుతున్న సీఐ మల్లేశ్


నర్సాపూర్(జి)లో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

తానూరు: గణేశుడి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ముధోల్ సీఐ మల్లేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన శాంతికమిటీ సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు కలిసిమెలిసి వేడుకలు నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై సందీప్, ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఏఈ స్వామి, ఆయా గ్రామాల నాయకులు, గణేశ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీవో గోవర్ధన్, పాల్దె అనిల్, ధనె రవి, కోఆప్షన్ మాజీ సభ్యుడు సయ్యద్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని నిర్మల్‌రూరల్ సీఐ రామకృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గురడిరెడ్డి కాపు సంఘ భవనంలో గణేశుడి మండపాల నిర్వాహకులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులతో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ చిన్నరామయ్య, ఎస్సై హన్మాండ్లు, ఏఎస్సై మాన్సింగ్, ఎంపీఓ తిరుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, చౌహాన్ కృష్ణ పాల్గొన్నారు.

కుంటాల: మండలకేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో ఎస్సై సీహెచ్. భాస్కరాచారి వినాయక మండపాల నిర్వాహకులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. సమావేశంలో తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ఎంపీడీవో ఎంఏ రహీం, ఆర్ఐ అడెల్లు, పంచాయతీ కార్యదర్శులు సుమన్, భోజన్న, సర్పంచ్‌లు జుట్టు మహేందర్, గల్లాపురం రమేశ్, మాజీ ఎంపీటీసీ చంద్రకాంత్, గజేందర్, సాయికుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలో లక్ష్మి కల్యాణ మండపంలో మండపాల నిర్వాహకులతో ఎస్సై అశోక్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ మోతీరాం తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

సన్మానం

కుభీర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన గంగారాం, విజయ్‌కుమార్, శ్రీనివాస్, మంజులత ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. శుక్రవారం వారిని పాఠశాలలో తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు జంగిలి సాయన్న, ఉపాధ్యాయుడు గంగాధర్ తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితా పరిశీలన

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించగా ఎంపీడీవో రహీం పరిశీలించారు. ఓటర్లను వార్డుల భారీగా విభజించి, కుటుంబసభ్యులను ఒకే చోట చేర్చి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అభ్యంతరాలు ఉంటే పంచాయతీ కార్యదర్శి, బీఎల్‌వోలకు చెప్పాలని సూచించారు.

పారిశుధ్య పనులు పరిశీలన

తానూరు: ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండలంలోని జౌలా(కే)లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎస్సీ కాలనీలో రోడ్డుపై గుంతలు పూడ్చివేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో అబ్దుల్ సమద్ ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని రాజురా, సింగాపూర్ గ్రామాల్లో పారిశుధ్య పనులను శుక్రవారం ఎంపీవో రత్నాకర్‌రావు పరిశీలించారు. డ్రైడే ఫ్రైడే పురస్కరించుకుని ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించి దోమలు వృద్ధి చెందకుండా బయో లార్వా స్ప్రే చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

వర్షంతో ఆగమాగం

పెంబి: మండల కేంద్రంలోని అంగడి(వారసంత)లో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా భారీవర్షం కురవడంతో వరద పారింది. దీంతో చిరువ్యాపారులు, కూరగాయలు కొనేందుకు వచ్చిన ప్రజలు ఇబ్బందిపడ్డారు.

వినతిపత్రం అందజేత

లక్ష్మణచాంద: మండలంలోని పీచరలోని చెరువులను గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని.. చెరువులపై అందరికీ హక్కులుండేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ వీడీసీ సభ్యులు, ఇతర సంఘాల నాయకులు శుక్రవారం తహసీల్దార్ జానకికి, ఎస్సై సుమలతకు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. గ్రామం వచ్చి వెళ్లి ప్రజలతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

స్వచ్ఛతపై ర్యాలీ

మామడ: మండలంలోని కొరిటికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం గ్రామంలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో జ్వరపీడితులు పెరగడంతో మానవహారం చేసి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ముధోల్: వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారని.. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ముధోల్ మాజీ జెడ్పీటీసీ లక్ష్మి నర్సాగౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పత్తి, సోయా, వరి పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అధికారులు పంట నష్టం సర్వే చేసి ఆదుకోవాలని కోరారు.

గ్రామాల్లో 'రూమ్ టు రీడ్'

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్‌లో రూమ్ టు రీడ్ కార్యక్రమంలో భాగంగా సంచార వాహనం ద్వారా విద్యార్థులకు పఠనంపై అవగాహన కల్పించారు. మండల విద్యాశాఖ నోడల్ అధికారి అశోక్ వర్మ, మండల కోఆర్డినేటర్ గోవర్ధన్‌నాయుడు వీధుల్లో తిరుగుతూ పుస్తకాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాప్రపూర్‌లో..

సోన్: మండలంలోని జాప్రపూర్ ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం రూమ్ టు రీడ్ కార్యక్రమం నిర్వహించారు. సంచార వాహనం ద్వారా విద్యార్థులకు పఠనాసక్తిపై అవగాహన కల్పిస్తున్నట్లు మండల సమన్వయ కర్త గోవర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు తొడిశెట్టి పరమేశ్వర్, స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముధోల్‌లో క్లస్టర్ల సంఖ్య పెంచాలి

ముధోల్: ముధోల్ మండలంలో క్లస్టర్ల సంఖ్య పెంచి ఏఈవోలను కేటాయించాలని శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాదర్బార్‌లో వినతిపత్రం అందించినట్లు ముధోల్ మాజీ సర్పంచ్ వెంకటపురి రాజేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో ఐదు ఏఈవో పోస్టులకు ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారని.. మిగతా నాలుగు క్లస్టర్లకు అధికారులను కేటాయించి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్, బాబాపూర్, కంజర్, బోరిగాం గ్రామాల్లో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు చేపట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కన్వీనర్ అడ్వాల రమేశ్, మండలాధ్యక్షుడు గోవర్ధన్, చందురెడ్డి, రంజిత్, మోహన్ రెడ్డి, ప్రవీణ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎల్‌ఎఫ్ నూతన కమిటీ

ఖానాపూర్: పట్టణంలోని ఎనిమిదో వార్డు పరిధిలో ఉన్న విద్యానగర్–1 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం (ఏరియా లెవల్ ఫెడరేషన్) ఏఎల్‌ఎఫ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో ఏఎల్‌ఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శెట్టి వీణ, కార్యదర్శి హబిదా, కోశాధికారిగా ఎన్. లక్ష్మి ఎన్నికయ్యారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కౌన్సిలర్ అబ్దుల్ కలీల్, మెప్మా సీవో రవీందర్, స్రవంతి, శైలజ, రాజేందర్, నారాయణ తదితరులు ఉన్నారు.

పరామర్శ

కుంటాల: మండలంలోని కల్లూరులో గంగారాం, అంబకంటి గ్రామానికి చెందిన రాజేశ్వర్‌రావు, కుంటాలకు చెందిన లక్ష్మి ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందారు. కాగా శుక్రవారం బీఆర్‌ఎస్ తాలూకా సమన్వయకర్త కిరణ్ కొమ్రే వార్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, పెంటవార్ దశరథ్, దాసరి కిషన్, ఖదీర్, వంశీ, ఆజాం ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక అండ


సాయం అందిస్తున్న అధికారులు

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన పందిరి ప్రభాకర్ అనే మిషన్ భగీరథ ఉద్యోగి ఆగస్టు 15న విధులు నిర్వర్తిస్తుండగా గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం ఈఈ సందీప్, ఏజెన్సీ ఎవరెస్ట్ జీఎం సంతోష్‌రెడ్డి సహకారంతో రూ.2,96,490ను ఆర్థికసాయంగా బాధిత కుటుంబానికి అధికారులు అందజేశారు. కార్యక్రమంలో భగీరథ సిబ్బంది రావుల గంగారెడ్డి, రాజారెడ్డి, సాయిలు, సాయి, సురేశ్, శ్రీనివాస్ ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899